# శీల పరీక్ష

శోభనం గదిలో పూలతో అలంకరించిన పం దిరికోళ్ళ మంచం మీద ముందు జరుగబోయే 'కార్యక్రమం' కళ్లముందు కదలాడుతుంటే గుం డెల్లోని చెప్పలేని గుబులుతో భర్త శ్రీకర్ రాకకై సుస్మిత నిరీక్షణ.

మొదటి రాత్రి భర్త రాకకై నిరీక్షించటం అంత మధురమైన క్షణాలు ఆడదాని జీవితంలో మరో సారి రావేమో.

పెళ్లి అయి మూడ్రోజులైనా శ్రీకర్ స్నేహి తులు ఇంకా కదలల్లేదు. మొదటిరాత్రి కదా కొత్త దంపతుల్లోని ఆత్రుత గ్రహించి విడివిపెట్టొచ్చు కదా! కాలేజీ స్టడీస్‌నాటి అమ్మాయిల కబుర్లతో లాన్‌లో కాలక్షేపం చేస్తున్నారు.

గోరువెచ్చని పాలు చల్లబడిపోయి గంట య్యింది. పూలవాసన ఆ గదిని కమ్ముకొని సుస్మిత లోని ఆత్రుతను అధికం చేస్తుంది. మరో అరగంట తర్వాత శ్రీకర్ ఆ గదిలో అడుగుపెట్టాడు.

తలుపు వేసొచ్చి "ఆలస్యం అయింది కదూ. వాళ్లు విడిచిపెడ్తే కదా! ఒకటే జోకులు. నవ్వలేక చచ్చాను. కడుపు పుండయ్యిందనుకో" అంటూ శ్రీకర్ మంచం ఎక్కేసాడు.

సుస్మిత మౌనంగా స్టూలు మీద వున్న పాల గ్లాసు తీసి భర్తకు అందివ్వబోతుంటే—

"ఏంటి? పాలా! తెలుగు సినిమాలు ఎక్కువ గా చూస్తావా ఏంటి? పాలు త్రాగితే కానీ ఫస్ట్‌నైట్ జరుపుకోకూడదని ఏమైనా రూల్ లాంటిది మీ ఆడవాళ్లు ఇంప్లిమెంట్ చేశారా! అదంతా నాకు చిరాకు. ప్రక్కన పెట్టు" శ్రీకర్ అలా అనే సరికి సుస్మిత భృకుటి ముడివడింది.

మొదటిరాత్రి ఒక్క క్షణాన్ని కూడా వృధా కాకుండా ముద్దూ మురిపెం సరసంతో సాగవల సిన రాత్రి భర్త చిరాకు చోటుచేసుకోవడంతో సుస్మిత కొద్దిగా డిప్రెషన్‌కు లోనయ్యింది.

'ఏంటి? అలా నిలబడ్డావ్. కమాన్' అంటూ విసురుగా సుస్మితను తనమీదకు లాక్కున్నాడు. సుస్మితకు మోటుతనం అన్పించింది. అయితేనేం మగ స్పర్శ తన గుండెకు శ్రీకర్ గుండె మీద ఏదో తెలియని పులకింత శరీరంలో ఏదో 'షాక్' అన్పిం చింది. అన్పించదూ ఆడదాని యవ్వన భారం మగ గుండెను తాకినప్పుడు అన్పించక ఛస్తుందా.

సుస్మిత వీపు మీద శ్రీకర్ చేతులు అటూ ఇటూ కదుల్తున్నాయి. సుస్మితలో గిలిగింత... ఏదో మాట్లాడాలనుకుంటుంది. కానీ సిగ్గుతో మాట్లాడలేకపోతుంది. అందుకేనేమో సుస్మిత తన ముఖాన్ని శ్రీకర్ గుండెల మీద ఆన్చేసింది.

"చాలాసేపు నిరీక్షించావు కదూ" అప్పు డన్నాడు శ్రీకర్.

"ఊఁ..." అంది సుస్మిత.

"ఏమన్పించింది?" శ్రీకర్.

"ఛీ... చెప్పలేను బాబూ"

"నిజంగా నీకిది మొదటి నిరీక్షణేనా?" శ్రీ కర్ అలా అడిగేసరికి సుస్మిత అదిరిపడింది. శ్రీకర్ గుండెమీద నుంచి తటాలున లేచింది.

"ఏంటంటు...న్నారు?" అడిగింది.

"యూనివర్శిటీలో ఎమ్.ఎ., చదివావు కదా. ఆడమగ తెలియకుండా మీరు చాలా క్లోజ్‌గా మూవ్ అవుతుంటారుగా. ఒకవేళ ఇంతకు ముందే అనుభవం వుందనుకో— ఇప్పటినీ నిరీక్ష ణలో అంత థ్రిల్ ఏం వుంటుందని అడిగాను" అంతే శ్రీకర్.

సుస్మితలో కంపరం మొదలైంది. ఎందుకి ఇతనికీ అనుమానం వచ్చిందో తనకి అర్థం కావ ట్లేదు. ఏ భర్త అయినా ఇంత డైరెక్టుగా ఫస్ట్‌నైట్ ఇలా ఓ ఆడదాన్ని అడుగుతాడా? తను ఆలోచిస్తుం డగా శ్రీకర్ మళ్ళీ—

"ఇలా అడిగానని ఏం అనుకోకు సుస్మిత. పెళ్లిలో నీ క్లాస్‌మేట్స్‌తో ఎంతో చనువుగా వుం టేనో... అఫ్‌కోర్స్ ఆడవాళ్లతో ఎంత చనువుగా వున్నావో, మగవాళ్లతో కూడా అంతే చనువుగా వున్నావనుకో" వ్యంగ్యంగా అన్నాడు.

ఇప్పుడు సుస్మితకు శ్రీకర్ ఎటువంటివాడో అర్థం అయిపోయింది. మొదటిరాత్రే తన భర్త ఎటువంటి వాడో చాలా కొద్దిమందికే తెలుస్తుంది. ఆ జాబితాలో తనూ చేరిపోయింది. కానీ ఇప్పుడేం చేస్తుంది. "అర్థేచ... ధర్మేచ... కామేచ..." వం టి వేదమంత్రాల మధ్య తన మెడలో కట్టే తాళి "సుస్మితా ఇప్పుడు నువ్వొకడికి భార్యవు" అని చెప్పకనే చెప్తుంది.

"అమెరికాలో ఇంజనీరుగా పనిచేస్తున్న... కులస్థుడైన ముప్పై ఏళ్ళ ఆరడుగుల అందమైన యువకునకు అదే కులాన్కి చెందిన అందమైన అమ్మాయి' 5 అడుగుల 8 అంగుళాల ఎత్తువు న్నామె వధువుగా కావలెను. వివరాలుతో ఈ క్రిం ద చిరునామాతో సంప్రదించండి" అని పేపర్లలో పడితే సుస్మిత తండ్రి కూతురి ఫోటో పెట్టా అప్లై చేశాడు.

తర్వాత ఒక హోటల్ గదిలో ఇంటర్వ్యూ చెయ్యడం శ్రీకర్ సుస్మితను లైక్ చెయ్యడం ఆ తర్వాత కొద్దిరోజుల్లో సుస్మితవాళ్ళ ఇంటిముందే ఘనంగా పెళ్లి జరగడం చకచకా అయిపోయాయి. రెండ్రోజులు తర్వాత సుస్మితతో సొంత ఊరైన గుడివాడ వచ్చి మూడోరోజైన ఈ రోజు శ్రీకర్ ఇంట్లోనే శోభనం ఏరేంజ్ చెయ్యబడటం జరిగి పోయింది.

శ్రీకర్ వ్యంగ్యంగా చేసిన కామెంట్స్‌కి సుస్మి త సమాధానం చెప్పాలని... తనకు తాను మళ్లీ సమాధానపరుచుకుంది. మాటకు మాట సమా ధానం చెప్తే పర్యవసానం మరోలా వుంటుందేమో అని ఆడదానిలో వున్న సహజమైన అణకువ ప్రద ర్శించింది. మౌనంగా అలాగే మంచాన్కి ఆను కొని నిలబడింది.

సుస్మిత మౌనం శ్రీకర్‌ని మరింత సంస్కార హీనుడ్ని చేసింది. "ఏం? మాట్లాడట్లేదు. అయి దేళ్ళ నుండి అమెరికాలో వుంటూ కూడా బ్రాడ్ మెంటాలిటీ అలవర్చుకోలేదేంటి నా మొగుడు అని అనుకుంటున్నావా? అమెరికాలో అది కామ న్ కావచ్చు. అందుకే నేను అమెరికా అమ్మాయిని పెళ్ళిచేసుకోలేదు. మనదేశం అదీ ఆంధ్ర రాష్ట్రం — అదీ నా కులం అమ్మాయివైన నిన్నే పెళ్ళిచేసు కున్నది. నా భార్య శీలవతి అయివుండాలని" అన్నాడు శ్రీకర్.

-బొడ్డేపల్లి నారాయణమూర్తి

ఇంకా సుస్మిత మౌనాన్కి అర్థం లేదు. అందుకే పెదవి విప్పింది.

"అదేంటండి. స్నేహితులు జోక్స్ వేసి నవ్విస్తుంటే... నవ్వాను. అంతమాత్రాన శీలం వరకూ వెళ్ళిపోతున్నారు" అంది. "ఏం? ఎందుకు వెళ్ళకూడదు? ఇంతకు మునుపు మీ మధ్య ఎంత చనువు లేకపోతే అక్కడ నేను వున్నాకూడా వాళ్ళు నీతో అంత పగలబడి నవ్వుతారు. ఒకటిరెండు సార్లయితే ఆ వెంకటేష్, మూర్తిగాడు నిన్ను టచ్ వేశారు కూడా" అన్నాడు శ్రీకర్.

"మీకలా అన్పించిందేమో కానీ... వాళ్ళు నన్ను తాకలేదు. దగ్గరగా వుండడం వల్ల మీకలా అన్పించిందేమో కానీ వాళ్ళు నిజంగా నన్ను తాకినట్లయితే స్నేహితులని చూడకుండా కూడా వార్నింగ్ ఇచ్చేదాన్ని. ఎందుకు మీకే అనుమానం వచ్చిందో నాకు అర్థం కావట్లేదు. ఎవరైనా నా గురించి చెడ్డగా చెప్పారా?" సుస్మితలో సహనం తగ్గి పోతుంది.

"ఎవరో చెప్తే నమ్మటాన్కి నేనేం పల్లెటూరి బైతునా. కళ్లతో చూశాను మీ పకపకలు. ప్రతి భావం వెనుకా ఒక భాష్యం ఉంటుంది. నీతో వాళ్ళు ప్రవర్తించే తీరు వెనుక అర్థం నాకు మరోలా అన్పించింది. ఇంక మనకు వాదనలు అనవసరం. రేపు లేడీ డాక్టరు దగ్గరకు వెళ్తున్నాం. అంతా సక్రమంగా వుంటే మనకు ఫస్ట్‌నైట్ రేపే. వెళ్ళి ఆ మూల పడుకో" ఆ గదిలో ఓ మూల చాపను చూపించాడు అది పరుచుకొని పడుకోమన్నట్లుగా.

లేడీ డాక్టరు దగ్గరకు ఎందుకెళ్ళాలి అంటున్నాడో శ్రీకర్ సుస్మితకు అర్థం కాలేదు. అందుకే అడిగింది.

"లేడీ డాక్టరు దగ్గరికి ఎందుకు?"

"ఎందుకేంటి? వర్జనిటీ టెస్టు (శీలపరీక్ష) వేయించటాన్కి" అదేదో బ్లడ్ టెస్ట్ అంత ఈజీగా శ్రీకర్ అనేసర్కి సుస్మిత నిశ్చేష్టురాలై పోయింది. ఛీ... ఛీ... ఇంత అనుమానపు మనిషి... ఇంకెక్కడైనా వుంటారా అని మనసులో అనుకొంది. అలాగే నేలమీద వాలిపోయింది. మస్తిష్కంలో ఆలోచనల దొంతరలు ఎప్పటికో నిద్రపోయింది. నిద్రలో కూడా కన్నీళ్లు వస్తున్నాయి. చెంపల మీదుగా ప్రవహిస్తున్నాయి.

★ ★ ★

నర్సింగ్ హోమ్ నుండి సుస్మిత, శ్రీకర్ బయటపడ్డారు. ఇంటికి చేరుకున్నాక "సారీ సుస్మిత. నిన్ను అనుమానించాను" అన్నాడు శ్రీకర్. సుస్మిత మాట్లాడలేదు. అలాగే ఇంటి పెరట్లోకి వెళ్ళింది. ఉదయం ఆరేసిన చీర జాకెట్టు, లంగా ఆరిపోయాయి. వాటిని తీసుకొని గదిలోకి వచ్చి తను సూట్‌కేస్‌లో సర్దుకొంది. సూట్‌కేస్ చేతివ పట్టుకొని బయల్దేరింది.

"ఏయ్ సుస్మిత ఏంటి? ఎక్కడికి బయల్దేరావు?" సుస్మితను అడ్డుకున్నాడు శ్రీకర్.

"ముందు అడ్డులేవండి" అరిచింది.

ఆ అరుపుకి శ్రీకర్ తల్లిదండ్రులు ఆ గదిలోకి వచ్చారు.

"ఏంటమ్మా! ఏంటి జరిగింది" శ్రీకర్ తల్లి సుస్మితను అడిగింది. సుస్మిత ఎంత ఆపుకోడాన్కి ప్రయత్నించినా దుఃఖం ఆగలేదు. భోరున ఏడ్చేసింది. వెంటనే కంట్రోల్ చేసుకొని.

'నా కన్యత్వాన్ని పదిలంగా కాపాడుకొని నా భర్తకు కానుకగా అర్పించుకోవాలని నేను అనుకుంటే నన్ను అనుమానించి నీ కొడుకు అనే ఓ శాడిస్ట్ నాకు శీలపరీక్ష వేయించాడత్తయ్యా! ఆ పరీక్షలో నేను నెగ్గినా మిగతా జీవితమంతా నీ కొడుకుతో నెగ్గుకు రాలేనని తేలిపోయింది అత్తయ్యా! అందుకే వెళ్ళిపోతున్నాను. వెళ్ళిపోతూ అతనికీ పరీక్ష పెడుతున్నాను. అదేంటో తెలుసా! అత్తయ్యా... అదీ ఒక రకంగా శీలపరీక్షే. నీ కొడుకు విడాకుల నోటీసులు పంపించినా వాటిమీద సంతకం వేయను. కోర్టులో ససేమిరా విడిపోటాన్కి అంగీకరించను. కలిసే జీవిస్తాను అని చెప్తాను. కానీ నేను విడిగానే వుంటాను. అతనెలా మరో పెళ్ళి చేసుకుంటాడో నేనూ చూస్తాను. మగవాడు కదా అని విర్రవీగిన నీ కొడుకులాంటి వాళ్ళకు ఈ సుస్మిత పెట్టే శీలపరీక్ష ఓ గుణపాఠం కావాలి'అంటూ బిరబిరా బయటకు వెళ్ళిపోయింది సుస్మిత. ●

